రెండవ భాగం

# నాన్నా చెప్పవా ?! (ఇగ్నైట్ కార్నర్)

మోహన్ 6 సంవత్సరాల వయసు గల అబ్బాయి. వాళ్ళ నాన్నతో ముచ్చట్లు చేయడం పరిపాటి. విచిత్రమైన సందేహాల పుట్ట. గత నెలలో కొన్ని విశేషాలు తెలుసుకున్నారు. ఈ నెల విశేషాలేమిటో చూద్దామా !

మోహన్ : నాన్నా , నాకు ట్యాబ్లెట్ కొనిస్తానన్నావు కదా!

నాన్న : ట్యాబ్లెట్స్ నీకు ఎందుకు నాన్నా. ఆరోగ్యంగానే ఉన్నావు కదా!

మోహన్ : ట్యాబ్లెట్ అంటే మింగే ట్యాబ్లెట్ అనుకున్నావా డాడీ. ఆడుకునే ట్యాబ్లెట్. కొనిస్తానన్నావు కదా. మర్చిపోయావా ఏమి?

నాన్న : ఓ.. అదా. గుర్తుంది నాన్నా. త్వరలోనే కొనిస్తాను.

మోహన్ : నాన్నా... షాపులో కొనిస్తావా? లేదా ఆన్ లైన్ లో కొనుక్కుందామా...

నాన్న : నువ్వు పొదుపు చేసుకునే హుండీ నిండాక ఆలోచిద్దాం. డబ్బు అదనంగా కావాలంటే నేను ఇస్తాను. సరేనా.

మోహన్ : అలాగే నాన్నా. హుండీ నిండాక , ట్యాబ్లెట్ కొనడానికి ఎంత డబ్బు అదనంగా ఖర్చు అయితే ఆ మొత్తం నువ్వే భరించాలి.

వ్యాపారి : దండలూ... దండలూ...(మోహన్,వాళ్ళ నాన్న అలా మాట్లాడుకుంటుండగా వీథిలో గట్టిగా అరుచుకుంటూ వెళుతున్నాడు)

మోహన్ : నాన్నా , దండలు అమ్ముతున్నారు. మనకు ఉపయోగపడతాయేమో చూద్దామా.

వ్యాపారి : దండలూ... కీ చైన్లూ... పిన్నులూ... మొలతాళ్ళూ... పిన్నీసులూ...

నాన్న : సరే నాన్నా. చూద్దాం పద. కీ చైన్లు కొందాం.

మోహన్ : నేను దండలు కొనుక్కుందాం అన్నాను కదా. అవే కొనుక్కుందాం. కీ చైన్లు వద్దు. కావాలంటే నువ్వు కొనుక్కో.

మోహన్ : దండలంకుల్ ... దండలంకుల్... ఓ సారి మా యింటి దగ్గరకు రా. (పరిగెత్తుకుంటూ గేటు దగ్గరకు వెళ్ళి పిలిచాడు)

వ్యాపారి : (ఇంటి దగ్గరకు వస్తాడు)

మోహన్ : మంచి దండలున్నాయా అంకుల్ చూపించు

వ్యాపారి : దండలూ మంచివి ఉన్నాయి బాబూ. చూడూ.

మోహన్ : నాన్నా, రంగులు రంగులు ఉన్న దండలు భలే బాగున్నాయి. నేను ఒకటి తీసుకుంటాను.

నాన్న : అవేం బాగా లేవులే. వద్దు గానీ.

మోహన్ : అయితే, నువ్వే కీ చైన్లు కొనుక్కో. ఎంజాయ్ చేస్కో. నాకేం వద్దు గాని. (అలకతో లోపలికి వెళ్ళి తొంగి చూస్తుంటాడు)

నాన్న : నేను నీకు మంచి దండలు కొనిస్తానుగా... షాపులో...

వ్యాపారి : అదేంటి సార్. మంచి దండలు. ఇవి ఒంట్లో వేడిని లాగేస్తాయి. చలవ చేస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది.

నాన్న : అవునా. నిజంగానా.

వ్యాపారి : అవును సార్. పెద్దోళ్ళు అంటుంటే విన్లేదా. పెద్దోళ్ళ మాట చద్దన్నం మూట. ఇవి మెడలో వేసుకుంటే మీ ఒంట్లో ఉష్ణం కంట్రోల్ అవుద్ది. అదృష్టం పట్టుద్ది. డాక్టర్ తో పనిలేదు సారూ.

నాన్న : ఎంత?

వ్యాపారి : వంద కు ఒకటి. రెండు కొంటే ఎనభై చొప్పున ఇస్తాను.

నాన్న : మూడు కొంటానయ్యా. అరవై రూపాయలు చేసుకో.

వ్యాపారి : మా ఖరీదే లేదు సార్. డెబ్బయి ఐదుకు రూపాయి కూడా తగ్గించి ఇవ్వలేను.

నాన్న : సరే. మంచి దండలు ఇవ్వు. ... నాన్నా... ఇటురా. దండలు కొనుక్కుందాం. బాగున్నాయి. (మోహన్ ను పిలిచాడు)

మోహన్ : (పరిగెత్తుకుంటూ వస్తాడు)

నాన్న : ఏ రంగు దండ కావాలో చూసుకో. కొందాం.

మోహన్ : ఇందాక బాగాలేవన్నావు కదా. అప్పుడే బాగైపోయాయా. (అంటూ మెరూన్ రంగులో దండ చేతిలోకి తీసుకున్నాడు)

నాన్న : అది కాదు నాన్నా... ఎండాకాలం కదా. ఇవి వేసుకుంటే ఒంట్లో వేడి పోయి ఉల్లాసంగా ఉంటామట. అమ్మకు, నాకు, నీకు కలిపి మూడు కొందాం. సరేనా!

మోహన్ : అయితే ఈ దండ వేసుకుంటే గొడుగు లేకుండా ఎండలో బజారుకు వెళ్ళొచ్చా. ఎండాకాలం కదా ఉక్కపోస్తోంది. ఇది వేసుకుంటే ఏ.సి. తో అవసరం లేదు కదా! భలేగా ఉంటుంది డాడీ అపుడు. భలే సరదాగా ఉంటుంది. కదా! (సంతోషంతో దండ వేసుకుంటూ)

నాన్న : (ఆలోచనలో పడ్డాడు. నిజంగా దండలు వేడిని తగ్గిస్తాయా ? ఏ సైన్సు నియమం ప్రకారం ఇది జరుగుతుంది ? అనుకున్నాడు)

నాన్న : ఒక్క దండ చాలు. మా అబ్బాయి ఆడుకోవడానికి చాలు. యాభై రూపాయలు తీసుకో.

వ్యాపారి : మంచి బేరమే సారూ. యాభైకి భోజనం కూడా రావడం లేదు. వందకు పైసా తగ్గేది లేదు.

నాన్న : ఇదిగో ఎనభై రూపాయలు తీసుకో. ఇంకేం మాట్లాడకు. సరిపోతుంది కానీ. (అని డబ్బు ఇచ్చాడు)

నాన్న : (మోహన్ అన్న మాటలు ఇంకా మనసులో మెదులుతూనే ఉన్నాయి. ఉష్ణ నియమాల గురించి సైన్స్ పుస్తకాలు పరిశీలించాలని భావించాడు)

IGNITE PHYSICS THINK BETTER
ignitephysics.weebly.com